# పెన్ పవర్

## తెలంగాణ రౌండప్

గురువారం | 11 జూలై 2024 | పేజీలు 8


క్రిష్ణారెడ్డి మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు..



- దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధి బౌరంపేటలో ఓ రైతు కుటుంబంలో విషాదం..
- ల్యాండ్‌మార్క్ బిల్డర్ ఒత్తిడితో అదృశ్యం అయిన రైతు..! విషయం తెలిసి తండ్రి హఠాన్మరణం..
- బౌరంపేట్ త్రిపుర ల్యాండ్‌మార్క్ నిర్వాహకులు, కార్పోరేటర్, భూమి విక్రయించమని రైతుపై ఒత్తిడి..
- దొమ్మర పోచంపల్లి మాదవరెడ్డికి చెందిన సర్వే నెం.187, 188, 189 వ్యవసాయ భూమి..
- సదరు భూమిని విక్రయించాలని ఏదో రకంగా రైతు మాదవరెడ్డిపై ఆ ఇద్దరు ఒత్తిడికి గురిచేశారని..
- గ్రామంలో పదిమందిలో బూతులు తిట్టారని మనస్తాపం చెందిన మాదవరెడ్డి..
- తనపిల్లలను రక్షించమని దుండిగల్ ఇన్‌స్పెక్టర్‌కి లేఖ రాసి వెళ్ళి మంగళవారం అదృశ్యం..!
- ఓ కేసులో బాధితుడిని అరెస్టు చేసిన దుండిగల్ పోలీసులు..
- పోలీసుల వైఖరిపై బాధితుడి కుటుంబ సభ్యుల ఆరోపణలు..!
- అదే కేసులో అవతలి పక్షం వారికి యాంటిసిపేటరీ బెయిల్‌కి సహకరించారన్న బాధితుడి వర్గం..!
- లేఖలో ల్యాండ్‌మార్క్ ఓనర్ సుధాకరెడ్డి, నిజాంపేట్ కార్పొరేటర్ మేకల వెంకటేష్ పేర్లు.

# కొడుకు అదృశ్యం..!

# తండ్రి గుండెపోటుతో మృతి..!

**ఓ బిల్డర్, కార్పొరేటర్ వేధింపులే ఇందుకు కారణమని కుటుంబ సభ్యులు ఆరోపణ..!**

కొడుకు అదృశ్యం తెలిసిన.. తండ్రి క్రిష్ణారెడ్డి మృతి.. ఫైల్ ఫోటో..





అదృశ్యమైన రైతు మాధవ రెడ్డి.. ఫైల్ ఫోటో..



వెంచర్ నిర్వాహకుడు, నిజాంపేట్ కార్పోరేటర్ వేధింపులతో ఓ రైతు కుటుంబంలో విషాదచాయలు అలుముకున్నాయి.. ఆంధ్రప్రదేశ్‌కి చెందిన బౌరంపేట్ బిల్డర్, కార్పోరేటర్‌తో కలిసి వ్యవసాయ భూమిని విక్రయించాలని వేధింపులకు గురిచేయడం..! పలుకుబడి ఉపయోగించి సదరు రైతుపైనే తప్పుడు కేసులు పెట్టారని..! తరచూ భూమి విక్రయంపై వేధింపులు తాళలేక ఇంటినుండి వెళ్ళిపోతున్నానని..! దుండిగల్ సిఐకి లెటర్ రాసి మంగళవారం అదృశ్యమైన రైతు మాధవ రెడ్డి ..! విషయం తెలుసుకున్న బాధితుని తండ్రి క్రిష్ణారెడ్డి(70) గుండెపోటుతో బుధవారం మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు ఆరోపించారు.. మంగళవారం దుండిగల్ పోలీస్ స్టేషన్‌లో మాధవ రెడ్డి అదృశ్యంపై మిస్సింగ్ కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ శంకరయ్య తెలిపారు.. బుధవారం సాయంత్రం వరకు అదృశ్యమైన రైతు మాధవ రెడ్డి ఆచూకి లభించ లేదని, సెల్‌ఫోన్ కూడా ఇంటివద్దే వదిలేసి వెళ్ళినట్లు దుండిగల్ ఇన్‌స్పెక్టర్ శంకరయ్య పేర్కొన్నారు.. మేడ్చల్ జిల్లా బ్యూరో, పెన్ పవర్, జూలై 10:

-2లో

# పద్మశ్రీ పురస్కార గ్రహీతలకు సీఎం రేవంత్ సన్మానం



హైదరాబాద్ పెన్ పవర్:తెలంగాణ నుంచి పద్మశ్రీ పురస్కారం అందుకున్న వారిని సీఎం రేవంత్? రెడ్డి సన్మానించారు. వివిధ రంగాల్లో ప్రావీణ్యం కనపరచి కేంద్ర ప్రభుత్వంనుంచి పద్మశ్రీ అందుకున్న తెలంగాణకు చెందిన గడ్డం సమ్మయ్య, దాసరి కొండప్ప, వేలు ఆనందచారి, కూరేళ్ల విఠలాచార్య, కేతావత్ సోంలాల్, ఉమా మహేశ్వరి లకు సచివాలయంలో సీఎం రేవంత్? రూ.25 లక్షల చెక్కును అందించారు.. ఈ సందర్భంగా పురస్కార గ్రహీతలు ముఖ్యమంత్రిగారికి కృతజ్ఞతలు తెలిపారు. కవులు, కళాకారులను గుర్తించి ప్రోత్సహించడం ప్రభుత్వాల బాధ్యత అని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు.

-3లో


# హైదరాబాద్‌లో బడా రియల్ ఎస్టేట్ వ్యాపారి.. దారుణ హత్య




హైదరాబాద్ పెన్ పవర్: హైదరాబాద్ సిటీ శివార్లలో ఘోరం.. పెద్ద రియల్ ఎస్టేట్ వ్యాపారిగా గుర్తింపు పొందిన కమ్మరి కృష్ణను హత్య చేశారు దుండగులు. షాద్ నగర్ లోని తన ఫాంహౌస్ నుంచి బయటకు వస్తున్న సమయంలో.. ప్రత్యర్థులు కత్తులతో దాడి చేసి.. కిరాతకంగా నరికి చంపారు. కమ్మరి కృష్ణను చంపిన

-3లో

# కొడుకు అదృశ్యం..! తండ్రి గుండెపోటుతో మృతి..!


Date 8/7/2024
V. Madhava Reddy

మాధవ రెడ్డి దుండిగల్ సిఐకి రాసిన లేఖ..




గత మే 22న విలేఖరుల సమావేశంలో మాధవ రెడ్డి, ఆయన సోదరుడు..



## కొడుకు అదృశ్యం తెలిసి.. కుప్ప కూలిన తండ్రి..


కొడుకు మాధవ రెడ్డి అదృశ్యమైన విషయం తెలియడంతో తండ్రి క్రిష్ణారెడ్డి గుండెపోటుతో మృతిచెందాడు.. దీనంతటికీ త్రిపుర ల్యాండ్‌మార్క్ నిర్మాణ సంస్థ ఓనర్ సుధాకర్,కార్పొరేటర్ మేకల వెంకటేశం వేధింపులే కారణమని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు.. బాధితులు ఓ కుటుంబం ఇంటిపెద్దను కోల్పోయారని కన్నీరు మున్నీరుగా, విలపించారు.. భూమి విక్రయంపై త్రిపుర ల్యాండ్‌మార్క్ సంస్థ ఓనర్ సుధాకర్, నిజాంపేట బిఆర్ఎస్ కార్పొరేట్ మేకల వెంకటేశం,వత్తిడి చేయడంతోనే, మాధవరెడ్డి మంగళవారం దుండిగల్ సిఐ పేరిట లేఖరాసి అదృశ్యమయ్యాడు..!కుమారుని అదృశ్య సంఘటనతో తండ్రి వంపుగూడెం కృష్ణా రెడ్డి (70) మరణంతో ఆ కుటుంబంలో విషాద చాయలు నెలకొన్నాయి..

## తన స్వగ్రామంలోనే అవమానకరంగా దూషించారు: లేఖలో..!

త్రిపుర ల్యాండ్‌మార్క్ నిర్వాహకులు సుధాకర్ తన వ్యవసాయ భూమిని అతితక్కువ ఖరీదుకు కొనుగోలు చేసేందుకు..! పలు విధాల విధించారని, పలుకుబడి ఉపయోగించి తనపై తప్పుడు కేసులు పెట్టించారని.. తన పనివాళ్ళతో తమపై దాడులు కూడా చేయించారని మాధవ రెడ్డి కుటుంబ సభ్యులు ఆరోపించారు.. చివరికి వేధింపులకు తాళలేక మంగళవారం, దుండిగల్ ఇన్‌స్పెక్టర్ శంకరయ్యకి, తన పిల్లలను కాపాడలని కోరుతూ లేఖ రాసి ఇంటినుండి వెళ్ళిపోయాడు.. సొంత ఊరిలో తనకు ఉన్న వ్యవసాయ భూమిని దౌర్జన్యంగా లాక్కునేందుకు ప్రయత్నిస్తున్నారంటూ పోలీస్ లకు రాసిన లేఖలో పేర్కొన్నాడు.. బౌరంపేట గ్రామానికి చెందిన వంపుగూడెం మాధవరెడ్డి కుటుంబానికి దొమ్మరపోచంపల్లి గ్రామ సర్వే నంబర్ 188 లో ఒక ఎకరం 13 గుంటల వ్యవసాయ భూమి పూర్వీకుల నుండి ఉంది.. సదరు భూమిని త్రిపుర ల్యాండ్‌మార్క్ వెంచర్ నిర్మాణ సంస్థ ఓనర్ సుధాకర్ విక్రయించాలని పలు మార్గాల ద్వారా ఒత్తిడి తెచ్చాడు.. ఎలాగైనా భూమిని కొట్టేసేందుకు ల్యాండ్‌మార్క్ సుధాకర్, నిజాంపేట్ బీఆర్ఎస్ కార్పొరేటర్ మేకల వెంకటేశం, గ్రామస్తులను తనపై ఉసిగొలిపి వేధింపులకు పాల్పడ్డారని, మనస్థాపానికి గురైన బాధితుడు దుండిగల్ పోలీస్ స్టేషన్ సీఐకి లేఖ రాసి మంగళవారం అదృశ్యమయ్యాడు..

- మొదటి పేజి తరువాయి

త్రిపుర ల్యాండ్‌మార్క్ నిర్వాహకులు గత కొన్నేండ్లుగా బౌరంపేట్ పరిసరాల్లో వెంచర్‌లు నిర్మిస్తూ..! ఓ ప్రజాప్రతినిధి అండతో చెరువు నాలాలు, ప్రభుత్వ స్థలాలు కబ్జాచేసి..! చర్యలకు వచ్చిన అధికారులను ఒక్క ఫోన్‌కాల్‌తో వెనక్కి పంపించి శాసిస్తున్నారు..! అదే ల్యాండ్‌మార్క్ నిర్వాహకులు సుధాకర్, నిజాంపేట్ కార్పోరేటర్‌తో కలిసి..! బౌరంపేట్ గ్రామానికి చెందిన రైతు కుటుంబంలో విషాదానికి కారణమైనట్టు..! మంగళవారం అదృశ్యమైన మాధవ రెడ్డి' దుండిగల్ సిఐకి రాసిన లేఖతో స్పష్టమవుతుంది.. బౌరంపేటలో చెరువులు, కట్టుకాలువల కబ్జాలకు అలవాటు పడిన "త్రిపుర ల్యాండ్‌మార్క్" వెంచర్ ఓనర్ సుధాకర్.. దుండిగల్ గండిమైసమ్మ మండలం దొమ్మర పోచంపల్లి సర్వే నెం.188లో బాధితుడు మాధవ రెడ్డికి ఉన్న ఎకరం 01.13 గుంటల వ్యవసాయ భూమిపై సుధాకర్ కన్ను పడింది.. సుధాకర్‌కి తోడు నిజాంపేట్ కార్పోరేటర్‌ను జతచేసుకుని రైతు మాధవ రెడ్డిని తరచూ బెదిరింపులకు గురిచేసినట్లు గత "మే నెల 22న" రైతులపై సుధాకర్ అనుచరల దాడిలో భాగంగా..! రైతు మాధవ రెడ్డి పత్రికా విలేఖరులతో మాట్లాడాడు.. అప్పట్లో ఆ ఇద్దరితో మరికొందరిపై దుండిగల్ పోలీస్ స్టేషన్‌లో కేసులు నమోదు అయ్యాయి..




గత మే 22న

## అమ్మా,నాన్న కుటుంబం జాగ్రత్త.. నన్ను క్షమించండి..

దుండిగల్ సీఐ శంకరయ్యకు లెటర్ రాసిన బాధిత రైతు మాధవ రెడ్డి.. సార్ నేను భూవివాదంతో విసిగిపోయాను మికు ఎన్నిసార్లు విన్నవించినా మాకు న్యాయం చేయట్లేదు.. నా కుటుంబం జాగ్రత్త, అమ్మానాన్న, పిల్లలు క్షమించండి, నా ఇబ్బందికి కారకులు నిజాంపేట కార్పొరేటర్ మేకల వెంకటేశం, త్రిపుర ల్యాండ్ మార్క్ ఓనర్ పసుపులేటి సుధాకర్ అంటూ లెటర్ రాసి ఇంట్లో ఉంచి కనిపించకుండా పోయాడు, మంగళవారం ఉదయం ఇంట్లో లెటర్ చూసిన కుటుంబ సభ్యులు ఆందోళనకు గురై ఆచూకీ కొరకు చుట్టుపక్కల బంధువుల ఇళ్లలో,స్నేహితుల వద్ద వెతికిన ఫలితం లేకపోవడంతో దుండిగల్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు.ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు అతను ఆచూకీ కొరకు తనిఖీలు చేపట్టారు.. అదృశ్యమైన మాధవరెడ్డి తన సెల్‌ఫోన్‌ను ఇంటి వద్దనే వదిలేయడంతో..! అతని ఆచూకీ కనుక్కునేందుకు పోలీసులకు కష్టతరంగా మారింది.. మాధవరెడ్డి ఇంటి చుట్టు పరిసరాలు ప్రాంతాల్లో ఉన్న సీసీ కెమెరాలను పోలీసులు క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు.. తండ్రి మరణవార్తతో అంత్యక్రియలకు ఇంటికి చేరుకునే అవకాశం ఉందని దుండిగల్ పోలీసులు భావిస్తున్నారు.. ఈ భూవివాదంలో గత మే నెలలో ఇరువురిపై కేసులు నమోదుకాగా..! అదే సమయంలో పసుపులేటి సుధాకర్, తదితరులపై కూడా దుండిగల్ పోలీస్ స్టేషన్‌లో కేసునమోదు అయింది.. బాధితుడు మాధవరెడ్డికి ఏదైనా జరుగుతే పూర్తి బాధ్యత ల్యాండ్ మార్క్ యజమాని పసుపులేటి సుధాకర్,నిజాంపేట్ కార్పొరేటర్ మేకల వెంకటేశ్ బాధ్యత వహించాలని హెచ్చరించారు..

## పద్మశ్రీ పురస్కార గ్రహీతలకు సీఎం రేవంత్ సన్మానం

- మొదటి పేజీ తరువాయి

లేదంటే మన భాష, సంప్రదాయాలు అంతరించిపోయే ప్రమాదం ఉందని తెలిపారు. భాష, సాంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని.. ఇందుకోసం రాజకీయాలకు అతీతంగా అందరూ ఒక్కటి కావాలని పిలుపునిచ్చారు. తెలంగాణ సచివాలయంలో రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో పద్మశ్రీ అవార్డుల గ్రహీతలను సన్మానించారు. ఒక మంచి సంప్రదాయానికి పునాది వేసేందుకే పద్మశ్రీ అవార్డుల గ్రహీతలకు సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశామని, ఇది ఇలాగే కొనసాగించాలని ఆయన ఆకాంక్షించారు.

## హైదరాబాద్‌లో బడా రియల్ ఎస్టేట్ వ్యాపారి.. దారుణ హత్య

- మొదటి పేజీ తరువాయి

తర్వాత.. అక్కడి నుంచి నిందితులు పరార్ అయ్యారు. 2024, జూలై 10వ తేదీ మధ్యాహ్నం తర్వాత ఈ ఘటన జరిగినట్లు సమాచారం. విషయం తెలిసిన పోలీసులు స్పాట్ కు చేరుకుని విచారణ చేస్తున్నారు. బండ్లగూడ జాగిర్ మున్సిపల్ కార్పొరేషన్ హైదర్ షాకోట్ కు చెందిన కమ్మరి కృష్ణ రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారు. కన్వెన్షన్ సెంటర్లు, ఫాంహౌస్ నిర్మాణాలు చేస్తూ కేకే గా గుర్తింపు పొందారు. హత్య షాద్ నగర్ సమీపంలోని కమ్మదనంలో ఉన్న తన సొంత కె.కె ఫాంహౌస్ లో ఉండగానే.. నిందితులు రెక్కీ నిర్వహించి.. పక్కా ప్రణాళికతో హత్య చేసినట్లు తెలుస్తోంది. చికిత్స కోసం శంషాబాద్ లోని ట్రైడెంట్ హాస్పిటల్ కు తీసుకు వెళ్తుండగా దారిలో కేకే మృతి చెందాడు. హత్యకు కారణాలు ఏంటీ అనేది ఇంకా స్పష్టంగా బయటకు రాలేదు. రియల్ ఎస్టేట్ వ్యాపారంలో గొడవలా లేక ఆర్థిక లావాదేవీలా లేక వ్యక్తిగత వ్యవహారాల అనేది పోలీస్ విచారణలో తేలాల్సి ఉంది.

## రియల్టర్ కేకేని హత్య చేసింది ఇతనే.. కారణం ఇదేనా?



హైదరాబాద్ పెన్ పవర్: షాద్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కమ్మదనం గ్రామంలో బుధవారం రియల్టర్ కమ్మరి కృష్ణ దారుణ హత్య కలకలం రేపింది. ప్రముఖ రియల్టర్ కమ్మరి కృష్ణ అలియాస్ కేకే తన సొంత ఫామ్ హౌస్ లో బాబా అనే వ్యక్తి దారుణంగా హత్య చేశాడు. కేకే భార్య ముందే ఆయనపై కత్తులతో దాడి చేశారు దుండగులు. తీవ్రంగా గాయపడిన కేకేను శంషాబాద్ లోని ఓ ప్రైవేట్ హాస్పిటల్ తరలిస్తుండగా మృతి చెందాడు. భూ లావాదేవీలే హత్యకు కారణమని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. శంషాబాద్ హాస్పిటల్ వద్ద భారీగా పోలీసులు మోహరించారు. షాద్నగర్ హత్య కేసు నిందితుడు బాబాను శంషాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో అదుపులోకి తీసుకున్న శంషాబాద్ రూరల్ పోలీసులు. అనంతరం నిందితుడిని షాద్నగర్ పోలీసులకు అప్పగించారు.

# అనర్గళంగా ఇంగ్లిష్ లో మాట్లాడుతూ అదరగొడుతున్న ఆటో డ్రైవర్..

**ఇంగ్లిష్ తో ఆకట్టుకుంటున్న మహారాష్ట్రలోని అమరావతి ఆటో డ్రైవర్**

**ప్రపంచంలో ఎక్కడ బతకాలన్నా ఇంగ్లిష్ ను తప్పనిసరిగా నేర్చుకోవాలని సూచన**

**ఇంగ్లిష్ అంతర్జాతీయ భాష అంటూ కామెంట్**

**నెట్టింట వీడియో వైరల్.. 30 లక్షలకుపైగా వ్యూస్**



హైదరాబాద్ పెన్ పవర్:మహారాష్ట్రలోని అమరావతిలో ఆటో డ్రైవర్ గా పనిచేస్తున్న ఓ పెద్దాయన తన ఇంగ్లిష్ వాగ్ధాటితో అందరినీ ఆశ్చర్యపరుస్తున్నాడు. ఎక్కడా తడుముకోకుండా అనర్గళంగా మాట్లాడుతూ అదరగొడుతున్నాడు. ఇందుకు సంబంధించిన వీడియోను ఓ యువకుడు సోషల్ మీడియాతో పంచుకోవడంతో అదికాస్తా వైరల్ గా మారింది. ఆ వీడియోకు ఏకంగా 30 లక్షలకుపైగా వ్యూస్ లభించాయి. ఆ వీడియోలో ఆయన మాట్లాడుతూ, ప్రపంచంలో ఎక్కడ బతకాలన్నా ఇంగ్లిష్ రావడం తప్పనిసరి అని చెప్పాడు. 'మీరు లండన్, పారిస్, అమెరికా, టోక్యో లాంటి ప్రాంతాలకు వెళ్లాలంటే ఇంగ్లిష్ రావాల్సిందే. లేకపోతే మీరు అక్కడకు వెళ్లలేరు. ఉదాహరణకు మీరు లండన్ లో ఏదైనా హోటల్ కు వెళ్లి ఓ గ్లాస్ మంచినీళ్లు కావాలని ఇంగ్లిష్ లో అడిగితే టక్కున తెచ్చిస్తారు. అదే మీరు మరాఠీలో అడిగితే ఈ హోటల్ లో మీకు ప్రవేశం లేదు.. గెటవుట్ అంటారు' అంటూ ఇంగ్లిష్ లో ఆ ఆటోడ్రైవర్ చెప్పుకొచ్చాడు. అందుకే ప్రతి ఒక్కరూ ఆంగ్లం నేర్చుకుని మాట్లాడాలని సూచించాడు. ఇంగ్లిష్ ను అంతర్జాతీయ భాషగా అభివర్ణించాడు. తన ఆటోలో పరిచయం లేని ఇద్దరు ప్రయాణికులను షేరింగ్ పద్ధతిలో ఆ పెద్దాయన తీసుకెళ్తున్నట్లు వీడియోలో కనిపించింది. తన గమ్యస్థానం చేరుకోగానే ఓ వ్యక్తి ఆటోలోంచి దిగి ఆయనతో సంభాషణ సాగిస్తూ ఈ వీడియో తీశాడు. అనంతరం ఆ వీడియోను తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో పోస్ట్ చేశాడు. 'నేను ఇవాళ ఓ ఆటో డ్రైవర్ గా పనిచేసే పెద్దాయన్ను కలిసి ఆశ్చర్యపోయా. ఎందుకంటే.. ఆయన అనర్గళంగా ఇంగ్లిష్ లో మాట్లాడుతున్నారు. ఆయనతో మాట్లాడేటప్పుడు నేనే కాస్త తడబడ్డాను. మామధ్య సరదా సంభాషణ సాగింది. అయితే అందరినీ ఇంగ్లిష్ లో మాట్లాడాలని ఆయన చైతన్యవంతులను చేయడం ఆశ్చర్యం కలిగించింది' అని ఆ వీడియో కింద క్యాప్షన్ ను జత చేశాడు. ఈ వీడియోను చూసిన నెటిజన్లు ఆ పెద్దాయన అవలీలగా ఇంగ్లిష్ మాట్లాడటం చూసి ఫిదా అవుతున్నారు. 'వావ్.. అద్భుతం' అని ఓ యూజర్ కామెంట్ చేయగా మరొకరేమో 'ఆయన మాటతీరు మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం లాగా ఉంది' అని అభిప్రాయపడ్డారు. ఇంకొందరేమో 'మీరు మా మనసులు గెలుచుకున్నారు చాచా' అని కామెంట్స్ పోస్ట్ చేశారు.

# నంద్యాల జిల్లాలో బాలికపై మైనర్ల గ్యాంగ్ రేప్.. హత్య

**మూడు రోజులుగా కనిపించని బాలిక**

**మిస్సింగ్ కేసు దర్యాప్తులో బయటపడ్డ దారుణం**

**నిందితులు ముగ్గురూ ఆరు, ఏడో తరగతి బాలురే**

**అత్యాచారం చేసి బాలికను కాలువలో పడేసిన నిందితులు**

హైదరాబాద్ పెన్ పవర్:నంద్యాల జిల్లాలో దారుణం చోటుచేసుకుంది. ఎనిమిదేళ్ల బాలికపై హైస్కూలు విద్యార్థులు ముగ్గురు అత్యాచారానికి పాల్పడ్డారు. ఆపై బాలికను కాల్వలోకి తోసేసి వెళ్లిపోయారు. బిడ్డ కనిపించలేదని తల్లిదండ్రులు ఫిర్యాదు చేయడంతో మిస్సింగ్ కేసు ఫైల్ చేసి దర్యాప్తు ప్రారంభించారు. జాగిలాలను రంగంలోకి దింపడంతో ఈ ఘోరం బయటపడింది. పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం..జిల్లాలోని ఓ ప్రాథమిక పాఠశాలలో మూడో తరగతి చదువుతున్న బాలిక మూడు రోజులుగా కనిపించకుండా పోయింది. చుట్టుపక్కల ప్రాంతాలు, తెలిసిన వాళ్ల ఇళ్లల్లో వెతికిన తల్లిదండ్రులు చివరకు పోలీసులను ఆశ్రయించారు. మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించిన పోలీసులకు తొలుత ఎలాంటి ఆధారాలు దొరకలేదు. దీంతో



జాగిలాలను రంగంలోకి దించారు. బాలికకు చెందిన డ్రెస్ వాసన చూపించి వదిలిపెట్టగా.. ఆ శునకాలు ముందు గ్రామ శివార్లలోని కాల్వ ఒడ్డుకు, అక్కడి నుంచి ముగ్గురు బాలుర ఇంటి వద్దకు తీసుకెళ్లాయి. ఆ ఇంట్లోని ముగ్గురు బాలురు కూడా బాలిక చదివే పాఠశాలలోనే ఆరు, ఏడో తరగతి చదువుతున్నారు. దీంతో వారిని అదుపులోకి తీసుకుని విచారించగా షాకింగ్ విషయాలు వెల్లడించారు. బాలికపై తాము అత్యాచారం చేశామని ఆ ముగ్గురు బాలురు తెలిపారు. ఆ తర్వాత భయపడి బాలికను చంపి కాల్వలో పడేశామని పోలీసులకు చెప్పారు. దీంతో బాలిక మృతదేహం కోసం పోలీసులు కాల్వలో గాలిస్తున్నారు. ముగ్గురు నిందితులూ పన్నెండు, పదమూడేళ్ల వయసున్న వారే, అయినప్పటికీ ఇంత ఘోరానికి పాల్పడడం గ్రామస్థులను నివ్వెరపరిచింది.

# కర్రపెండలం... సాగు దుంప .. లాభాల పంట

**హైదరాబాద్ పెన్ పవర్:**సాగవుతున్న దుంపజాతి కూరగాయ పంటల్లో కర్రపెండలానికి విశిష్ఠ స్థానం వుంది. వర్షాధారంగా జూన్, జూలై మాసాల్లోను, నీటి పారుదల కింద సంవత్సరం పొడవునా సాగుచేయవచ్చు. దుంపజాతి పంటైన కర్రపెండలాన్ని ముఖ్యంగా సగ్గుబియ్యం, గంజి పొడి తయారీలో ఎక్కువగా ఉపయోగిస్తారు. ఇది మంచి రుచికరమైన ఆహారం కూడా.దీని దుంపలను ఉడకబెట్టి తింటారు. కర్రపెండలం నుంచి వివిధ ఉత్పత్తలను తయారీచేసే పరిశ్రమలు ఈ ప్రాంతంలో వుండటంతో వేలాది మంది రైతులు ఈ పంటసాగుతో ఉపాధిపొందుతున్నారు. మెట్ట ప్రాంతాల్లో వర్షాధారంగా కర్రపెండలం సాగు గురించి ఇప్పుడు తెలుసుకుందాం.

పంట ఎప్పుడు నాటాలంటే..

వాణిజ్యసరళిలో సాగుచేసే దుంపజాతి కూరగాయ పంటల్లో కర్రపెండలం ప్రధానమైంది. దేశవ్యాప్తంగా 15 లక్షల 70 వేల ఎకరాల్లో సాగులో వుంది. కర్రపెండలాన్ని కసావా లేదా టాపియోకా అంటారు. ఇది ఉష్ణమండలపు పంట. అధిక తేమ, ఉష్ణోగ్రత గల వాతావరణం సాగుకు అనుకూలంగా వుంటుంది. సరైన వర్షపాతం గల మెట్ట, కొండ ప్రాంతాల్లో వర్షాధారంగా , ఆరుతడి పంటగా సాగుచేయవచ్చు. నీటి ఎద్దడిని బాగా తట్టుకుంటుంది. ఏజన్సీ ప్రాంతాల్లో ఈ పంటను అధికంగా సాగు చేస్తారు. జూన్– .. జూలై మాసాల్లో ఈ దుంప పంట సాగు మొదలు పెడితే... డిసెంబరు నుంచి మార్చిలోపు దుంప తీతకు వస్తుంది. దీని పంట కాలం, రకాన్నిబట్టి 8–నుంచి10నెలలు వుంటుంది. కర్రపెండలం దుంపల్లో పీచు పధార్ధంతో పాటు, పిండి పధార్ధం ఎక్కువగా వుంటుంది.

**కర్ర పెండలం.. సాగు రకాలు**

వరి పండని ప్రాంతాల్లో, దక్షిణాఫ్రికా వంటి దేశాల్లోని ప్రజలకు కర్రపెండలం ప్రధాన ఆహారం. దీని దుంపలనుంచి తయారుచేసే పౌడర్ ను వస్త్ర పరిశ్రమలో షైనింగ్ కోసం వాడతారు. అలాగే సగ్గుబియ్యం, జిగురు తయారీ, పశువుల దాణా తయారీ పరిశ్రమల్లోను, ఇథనాల్ తయారీకి ఎక్కువగా ఉపయోగిస్తారు. దుంపలు తియ్యగా వుంటాయి కనుక



చిప్స్ తయారీలోను, వివిధ వంటకాల్లోను వాడుతున్నారు. మెట్టప్రాంతం , నీటి వసతి తక్కువగా వుండటంతో రైతులు వర్షాధారంగా కర్రపెండలం సాగుకు మొగ్గుచూపుతున్నారు. తేలికపాటి ఇసుక భూములు, ఇసుకతో కూడిన ఒండ్రు నేలలు, ఎర్ర గరప నేలల్లో కర్రపెండలం దుంప వృద్ధి అధికంగా వుంటుంది. మన ప్రాంతంలో సాగుకు అనుగుణంగా హెచ్–226, హెచ్–165, శ్రీ ప్రభ, శ్రీ జయ, శ్రీ ప్రకాస్ వంటి రకాలు రైతులకు అందుబాటులో వున్నాయి.

**ఎలా నాటాలంటే...**

గత పంటనుంచే విత్తనాన్ని సేకరించి రెండునెలలపాటు విత్తనం భద్రపరుస్తారు. విత్తనాన్ని కొమ్మలతో ప్రవర్ధనం చేస్తారు. 7నుంచి –10నెలల వయసున్న బలమైన కొమ్మలను విత్తనపు కర్రలగా ఉపయోగించాలి. విత్తనపు కొమ్మల కొనభాగాన్ని మొదలు భాగాన్ని తొలగించి 20సెం.మీ పొడవుగల ముక్కలుగా కత్తిరిస్తారు. ఈ విత్తనపు ముచ్చెలనుంచి వేర్లు వృద్ధిచెందేందుకు 7 నుంచి 10 రోజులపాటు నారుమడిలో పెంచాల్సి వుంటుంది. ఎకరాకు 5 వేల విత్తనపు ముచ్చెలు అవసరమవుతాయి. వీటిని పెంచేందుకు 1మీటరు వెడల్పు, రెండున్నర మీటర్ల వెడల్పు, 15 సెంటీమీటర్ల ఎత్తు కలిగిన రెండు నారుమడులు అవసరం.

**నారుమడి జాగ్రత్తలు**

నారుమడిలో నాటేముందు మాంకోజెబ్ 3గ్రాములు, డైమిథోయేట్ 2మిల్లీలీటర్లు లీటరు నీటికి కలిపిన ద్రావణంలో ముచ్చెలను ముంచి నారుమడిలో పక్కపక్కనే నాటుకోవాలి. 7నుంచి 10రోజుల్లో ముచ్చెలు వేర్లు తొడిగి, చిగురించటం ప్రారంభమవుతుంది. వీటిని ప్రధాన పొలంలో నాటుకోవాలి. నాటే ముందు ఆఖరి దుక్కిలో ఎకరాకు 5టన్నుల పశువుల ఎరువు, 150కిలోల సింగిల్ సూపర్ ఫాస్ఫేట్, చెదల నివారణకు 20కిలోల లిండేన్ లేదా మిథైల్ పెరాథియాన్ పొడి వేసి కలియ దున్నాలి. నేలను 30నుంచి –35సెంటీమీటర్ల లోతుగా 3నుంచి 4సార్లు దుక్కిచేయాలి. వర్షాల వల్ల భూమిలో తగినంత తేమచేరిన తర్వాత ఆరోగ్యవంతమైన వేరు, చిగురు తొడిగిన ముచ్చెలను నాటటానికి ఉపయోగించాలి. వరుసలు, మొక్కల మధ్య ఎటుచూసినా 90సెంటీమీటర్ల ఎడం వుండేటట్లుగా, 5సెంటీమీటర్ల లోతులో ముచ్చెలు నాటుకోవాలి. నాటిన వారం పది రోజుల్లో ముచ్చెలనుంచి కొమ్మలు విస్తరించటం ప్రారంభమవుతుంది. నాటిన 10నుంచి 15రోజుల్లో చనిపోయిన మొక్కల స్థానంలో, 40సెంటీమీటర్ల పొడవున్న వేరు తొడిగిన ముచ్చెలను నాటాల్సి వుంటుంది.

ఎరువుల వివరాలు

కర్రపెండలం నాటిన 15 నుంచి 90రోజుల వరకు కలుపు లేకుండా నివారించాలి. ఈ పంటకు నత్రజని, పొటాష్ ఎరువులను పైపాటుగా అందించాలి. ఎకరాకు 24కి. నత్రజని, 24కి. పొటాష్ సరిపోతుంది. దీన్ని 3సమభాగాలుగా చేసి నాటిన 30, 60, 90 రోజులకు వేయాలి. ప్రతి మొక్క చుట్టూ గొప్పుచేసి మొక్కల మొదళ్లకు మట్టిని ఎగదోయాలి. 3నెలల వరకు తోటలో రసంపీల్చు పురుగులు, మచ్చ తెగుళ్ల బెడద లేకుండా జాగ్రత్త వహించాల్సి వుంటుంది.

**సాగులో ప్రధాన సమస్య**

ఈ పంటలో ప్రధానమైన సమస్య కసావా మొజాయిక్ వైరస్. దీనికి నివారణ లేదు కాబట్టి తెగులు సోకని తోటల నుండి నాణ్యమైన విత్తనాన్ని ఎంపికచేసుకోవాలి. వైరస్ ను వ్యాప్తిచేసే తెల్లదోమను సకాలంలో అరికట్టాలి. దోమ కనిపించిన వెంటనే డైమిథోయేట్ 2 మిల్లీలీటర్లు లేదా ఎసిఫేట్ 1గ్రాము లేదా ప్రొఫినోఫాస్ 2 మిల్లీలీటర్లు లీటరు నీటికి కలిపి 15 రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారిచేయాలి. మొజాయిక్ వైరస్ ను సమర్ధంగా తట్టుకునే శ్రీ రక్ష –1, శ్రీ రక్ష –2 రకాలను సాగుకు ఎంపిక చేసుకోవాలి.

**ఎప్పుడు నాటాలి... ఎప్పుడు కోయాలి**

కర్ర పెండల దుంప పెరగడం వర్షం మీద ఆధారపడి వుంటుంది. వర్షాభావ పరిస్థితులు ఏర్పడినప్పుడు ఆక్టోబరు నుండి

డిసెంబరు వరకు 3 నీటితడులు ఇవ్వగలితే దుంప బాగా వూరి దిగుబడి గణనీయంగా పెరుగుతుంది. ఈ పంటను జూన్... –జూలైలో నాటితే ఫిబ్రవరి.. మార్చిలో దిగుబడి వస్తుంది. ఈ సమయంలో దుంప తవ్వి సగ్గుబియ్యం ఫ్యాక్టరీలకు తరలిస్తారు. రైతులు కర్రపెండల దుంప ఊరుదలనుబట్టి ఎకరాకు 40 నుంచి 50 పుట్ల దిగుబడి సాధిస్తున్నారు. ఒక్కో పుట్టిని 225 కిలోలుగా లెక్కిస్తారు.

# ఎప్పుడు చూసినా నీరసంగా.. డల్ గా ఉంటున్నారా.. అయితే ఈ ఫుడ్ తీసుకోండి..

**హైదరాబాద్ పెన్ పవర్:**కొంతమంది చాలా బలహీనంగా ఉంటారు. ఏ పనీ చేయలేరు. త్వరగా అలసిపోతారు, నీరసంగానూ ఉంటారు. దీనికి అనారోగ్యం, పౌష్టికాహార లోపం, పని ఒత్తిడి వంటి పలు కారణాలు ఉన్నాయి. అయితే ఫిట్గా, యాక్టివ్ గా ఉండాలని చాలామంది కోరుకుంటారు. అలా ఉండాలంటే కొన్ని చిట్కాలు పాటించాలి. ఇప్పుడు అవేంటో చూద్దాం. . . ప్రతిరోజూ ఉదయాన్నే వ్యాయామం చేస్తే రోజంతా యాక్టివ్ ఉండవచ్చు. అనారోగ్య సమస్యలను కూడా దూరం చేసుకోవచ్చు. ఆహారం విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. కొవ్వు అధికంగా ఉండే పదార్ధాలను తినకూడదు. కూరగాయలు, పండ్లు ఎక్కువగా తీసుకుంటే అలసట తొలగిపోతుంది. రోజూ గ్లాస్ లెమన్ జ్యూస్ లో కొద్దిగా తేనె, ఉప్పు కలుపుకుని తీసుకుంటే మంచి ఫలితం కనిపిస్తుంది.

నిద్రలేమి వల్ల కూడా అనేక అనారోగ్యాలు వస్తాయి. మంచి నిద్రపట్టాలంటే రాత్రివేళలో పాలలో కొద్దిగా మిరియాల పొడి, తేనె, చక్కెర కలిపి తీసుకుంటే సరిపోతుంది. శరీరంలో తగిన మోతాదులో రక్తం లేకపోయినా కూడా నీరసంగా ఉంటుంది. ప్రతిరోజూ పాలలో ఖర్జూరాన్ని నానబెట్టి తీసుకుంటే రక్తం ఉత్పత్తి అవుతుంది. రక్త సరఫరా మెరుగుపడటంతో పాటు బలం కూడా వస్తుంది.





# మెడనొప్పి.. వెన్ను నొప్పి వేధిస్తున్నాయా..

# అయితే ఈ మసాజ్ లు చేయండి

**హైదరాబాద్ పెన్ పవర్:**వెన్నునొప్పి, మెడనొప్పి ఈ రోజుల్లో చాలా కామన్ అయిపోయాయి. ఆఫీసుల్లో గంటల తరబడి కూర్చోవడం, మొబైల్, ల్యాప్టాప్ వాడటం వంటి అనేక కారణాలతో ఈ పెయిన్స్ వస్తున్నాయి. ఒకటి, రెండు రోజుల్లో నొప్పులు తగ్గితే పర్లేదు. కానీ, రోజుల తరబడి పెయిన్స్ వేధిస్తుంటే ఎలాంటా ట్రీట్? మెంట్? తీసుకోవాలి.. పెయిన్స్ తగ్గించే కొన్ని సులభమైన మసాజ్ ల గురించి తెలుసుకుందాం. .. ఫిజియోథెరపీ, మసాజ్ వంటివి చేయించుకుంటే నొప్పులు తగ్గుతాయి.. మసాజ్ చేసుకోవడానికి అన్నిసార్లు నిపుణుల సాయమే అక్కర్లేదు. కొన్ని మసాజ్ లు సొంతంగా కూడా చేసుకోవచ్చు. ఈజీగా ఉండే కొన్ని మసాజ్ లు చేయడం ఎలాగో తెలుసుకుంటే మీ నొప్పుల్ని మీరే తగ్గించుకోవచ్చు. అయితే వీటిని అవసరమైనప్పుడు ఒక పద్ధతి ప్రకారం చేసుకోవాలి. విశ్రాంతిగా అవసరమైన పొజిషన్ లో కూర్చుని, గట్టిగా ఊపిరి తీసుకుంటూ మసాజ్ చేసుకోగలిగితే మంచి ఫలితం ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. పాదాలు...–చేతులు: ప్రతి పెయిన్ ను తగ్గించేందుకు ఒక ఆక్యుప్రెజర్ పాయింట్ ఉంటుంది. దాన్ని గుర్తించి ఆ ప్రదేశంలో నొక్కడం, మసాజ్ చేయడం చేస్తే నొప్పి చాలా వరకు తగ్గుతుంది. బ్యాక్ పెయిన్, నెక్ పెయిన్ కు సంబంధించి చాలా ట్రిగ్గర్ పాయింట్స్ ఉంటాయి. వాటిలో ముఖ్యమైనవి పాదాలు, చేతులు, పాదాల కింది భాగంలో బొటన, రెండో వేలుకు మధ్య ప్రదేశంలో ఉండే అక్యుప్రెజర్ పాయింట్లో నెమ్మదిగా నొక్కుతుండాలి. అరచేతికి సంబంధించి బొటనవేలి కింది భాగం, వేలు ప్రారంభమయ్యే ప్రదేశం, మణికట్టు భాగంలో కూడా ప్రెజర్ పాయింట్స్ ఉంటాయి. ఈ ప్రదేశాల్లో నెమ్మదిగా





నొక్కుతూ ఉంటే క్రమంగా నొప్పి తగ్గుతుంది.

టెన్నిస్ బాల్: మార్కెట్లో దొరికే టెన్నిస్ బాల్ తో మసాజ్ చేసుకోగలిగే...సాధారణంగా కండరాలు ఎక్కువ అలసటకుగురై, వాటిపై ఒత్తిడి పెరగడం వల్ల నొప్పి కలుగుతుంది. వాటికి విశ్రాంతినిచ్చి, ఒత్తిడి తగ్గించగలిగితే నొప్పి దూరమవుతుంది. దీనికోసం రెండు బాల్స్ ను తీసుకోవాలి. నేలపై యోగా మ్యాట్ పరిచి, వెల్లకిలా పడుకుని, మోకాళ్లు మడవాలి. అరికాళ్లు నేలను తాకుతుండాలి. వీపును కొద్దిగా పైకి లేపి, భుజాలకు దగ్గరగా, వీపు కింది భాగంలో రెండు టెన్నిస్ బాల్స్ ఉంచాలి. వాటిపై క్రమంగా వీపుతో ఒత్తిడి పెంచుతూ, బాల్స్ ను ఇతర కండరాలకు తగిలేలా అటూఇటూ తిప్పాలి. వీపు కండరాలు అంతా తగిలేలా బాలు తిప్పగలిగితే మంచి ప్రయోజనం ఉంటుంది.. ప్రతి కండరంపై కనీసం ఒక నిమిషం ఒత్తిడి పడేలా చూడాలి.

హాట్ టవల్ మసాజ్ : మెడనొప్పి తగ్గేందుకు ఈ మసాజ్ బాగా ఉపయోగపడుతుంది. ఇది ఒళ్లు కాపడం పెట్టడం లాంటిదే. ఒక సాఫ్ట్ టవల్, వేడి నీళ్లు కావాలంతే. టవలు కొద్దిగా మెలితిప్పి, వేడి నీటిలో ముంచాలి. టవల్ వేడెక్కాక, దాన్ని మెడపై వేసి రెండు చేతులతో అటూఇటూ సున్నితంగా లాగాలి. ఎక్కడ నొప్పి ఎక్కువగా ఉందో, అక్కడ టవల్ తో ఎక్కువగా ఒత్తిడి కలిగించాలి. ఇలా వేడి టవల్ తో ఎక్కువసార్లు చేసుకోగలిగితే మెడనొప్పి చాలా వరకు తగ్గుతుంది.

సింపుల్ మసాజ్: మెడనొప్పి తగ్గించేందుకు సాయపడే మరో సింపుల్ మసాజ్ ఇది. ఎడమచేతిని మెడపై ఉంచి, పైనుంచి కిందికి నొక్కుతూ రావాలి. ఇలా నొప్పి ఉన్న చోట, కాస్త రిలాక్స్ గా అనిపించే వరకు చేస్తూనే ఉండాలి. నొప్పి ఉన్న ప్రతి చోటా కనీసం ముప్పై సెకండ్ల వరకు మసాజ్ చేయాలి. మెడ చుట్టూ ఉన్న కండరాలు కూడా రిలాక్స్ అయ్యేలా చేస్తే, నొప్పి చాలా వరకు తగ్గుతుంది. అయితే మెడపై మరీ ఎక్కువ ఒత్తిడి కలిగించకుండా, సున్నితంగా నొక్కాలి.

హాట్ స్టోన్ మసాజ్: వేడినీటిలో ముంచిన లేదా కొద్దిగా వేడెక్కేలా చేసిన నునుపైన రాళ్లను వీపు, శరీరంలో నొప్పి ఉన్న ఇతర భాగాలపై ఉంచుతారు. ఈ వెచ్చదనం వల్ల కండరాలపై ఉన్న ఒత్తిడితగ్గి, అవి మృదువుగా తయారవుతాయి. ఈ తరహా మసాజ్ వల్ల కండరాల లోపలి భాగాలు కూడా రిలాక్స్ అవుతాయి. తగిన జాగ్రత్తలు తీసుకుంటూ ఇంట్లో కూడా చేసుకోవచ్చు. నొప్పి ఉన్న చోట, కొద్దిగా వేడెక్కిన రాళ్లను కొద్దిసేపు ఉంచి, అటూఇటూ జరిపితే చాలు.

షియాట్సు మసాజ్ : ఇది ప్రాచీన చైనీస్, జపనీస్ మసాజ్ మెథడ్. దీనిని ఇంగ్లీషులో ఫింగర్ ప్రెజర్ అంటారు. అంటే వేళ్లతో ఒత్తిడి కలిగించి, నొప్పి తగ్గించడం. ఈ మసాజ్ చేసేవాళ్లు ఎక్కువగా బొటనవేలును ఉపయోగిస్తారు. మిగతావేళ్లను, అరచేతిని కూడా ఉపయోగించి కండరాలపై ఒత్తిడి పెంచి, నొప్పుల్ని తగ్గిస్తారు. నొప్పికి సంబంధించిన అక్యుప్రెజర్ పాయింట్లపై మసాజ్ చేసి, కండరాలు రిలాక్స్ అయ్యేలా చేస్తారు. దీనివల్ల కండరాలు కొత్త శక్తిని పుంజుకుంటాయి.

ఆయుర్వేదిక్ మసాజ్: మన ప్రాచీన వైద్యవిధానాల్లో ఆయుర్వేదంఒకటి. ఈ పద్ధతిలో వివిధ వనమూలికల్నిఉపయోగించి తయారు చేసిన తైలాలను(ఆయిల్స్)ను ఉపయోగించి మసాజ్ చేస్తే, అవినొప్పిని తగ్గిస్తాయి. ఔషధాలు కలిగిన ఆయిల్స్ కణజాలలోపలికి చొచ్చుకెళ్లి, వాటిని రిపేర్ చేసి, విశ్రాంతినిస్తాయి. దీనివల్ల ఒళ్లు నొప్పులు తగ్గుతాయి.

# తెలంగాణలో ప్రభుత్వం ఎప్పుడు కూలుతుందా? అని బీజేపీ చూస్తోంది: బీవీ రాఘవులు

**బీజేపీ కుట్రలను తిప్పికొట్టేందుకు రేవంత్ రెడ్డి లౌకిక శక్తులను ఏకం చేయాలన్న సీపీఎం నేత**

**బీఆర్ఎస్‌కు మనుగడ ఉండాలంటే బీజేపీకి వ్యతిరేకంగా రాజకీయ నిర్ణయం తీసుకోవాలని సూచన**

**తెలంగాణలో బీజేపీ ఓటు బ్యాంకు పెరగడం ప్రమాదకరమని వ్యాఖ్య**

**కేరళలో బీజేపీ ఒక సీటు గెలవడం చింతించాల్సిన విషయమేనన్న సీపీఎం నేత**



**హైదరాబాద్ పెన్ పవర్:**తెలంగాణలో ప్రభుత్వం ఎప్పుడు కూలుతుందా? ఎప్పుడు గద్దెనెక్కుదామా? అని బీజేపీ కాచుకొని కూర్చుందని సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు అన్నారు. బీజేపీ కుట్రలను తిప్పికొట్టేందుకు లౌకిక శక్తులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఏకం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజలపై కేంద్రం మోపిన భారాన్ని మరిచిపోయి... రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను కేంద్రమంత్రి కిషన్ రెడ్డి చదువుతున్నారని విమర్శించారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో రాఘవులు మాట్లాడుతూ... తెలంగాణలో బీఆర్ఎస్‌కు మనుగడ ఉండాలంటే బీజేపీకి వ్యతిరేకంగా రాజకీయ నిర్ణయం తీసుకోవాలని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు సూచించారు. పార్లమెంట్‌లో ఇష్యూ టు ఇష్యూను బట్టి వ్యవహరిస్తామని కేటీఆర్ చెప్పడాన్ని ఆయన తప్పుబట్టారు. అలా స్పందించడమంటే రాజకీ యం కాదని... లొంగుబాటు అవుతుందన్నారు. దేశమంతా అభివృద్ధి జరిగితే ఇటీవలి లోక్ సభ ఎన్నికల్లో బీజేపీకి సీట్లు ఎందుకు తగ్గాయో ప్రధాని మోదీ చెప్పాలని నిలదీశారు. సీట్లు ఎందుకు తగ్గాయో ఆలోచన, ఆత్మవిమర్శ లేకుండా మోదీ మాట్లాడుతున్నారని విమర్శించారు. బీజేపీ ఎన్నికలను డబ్బులతో ముంచేసిందని ఆరోపించారు. తెలంగాణలో బీజేపీ ఓటు బ్యాంకు పెరగడం ప్రమాదకరం తెలంగాణలో బీజేపీ ఓటు బ్యాంకు 19 శాతం నుంచి 35 శాతానికి పెరగడం ప్రమాదకరమని వ్యాఖ్యానించారు. ఇక్కడ బీజేపీని నియంత్రించడంలో కాంగ్రెస్ పూర్తిగా విఫలమైందన్నారు. కేరళలోనూ బీజేపీ ఒక సీటు సాధించడం చింతించాల్సిన విషయమే అన్నారు. ప్రధాని మోదీ కార్పోరేట్ శక్తులకు సేవకుడిగా వ్యవహరిస్తున్నారని ఎద్దేవా చేశారు.

ఇండియా కూటమి విచ్ఛిన్నం కాకుండా ముందుకు వెళ్లడంలో సీపీఎం చేసిన త్యాగం మరే పార్టీ చేయలేదన్నారు. ఓట్లు.. సీట్లు కాదని... దేశాన్ని రక్షించుకోవడమే సీపీఎం లక్ష్యమన్నారు. తెలంగాణలో మతోన్మాదాన్ని ప్రజల మనస్సులో నుంచి తొలగించే బాధ్యత సీపీఎంపై ఉందన్నారు.

# మార్పు రావాలి... కాంగ్రెస్ రావాలి అంటే... మొత్తానికి పెద్ద మార్పే వచ్చింది: కేటీఆర్ ఆగ్రహం

**నాడు కాంగ్రెస్ పాలనలో హాస్టళ్లలో పురుగుల అన్నం.. నీళ్ల చారు..**

**ఇప్పుడు బల్లిపడిన టిఫిన్లు, చిట్టెలుక పడిన చట్నీలని మండిపాటు**

**విషాహారం తింటే... విద్యార్థుల ప్రాణాలకు గ్యారెంటీ ఎవరు? అని ప్రశ్న**

**హైదరాబాద్ పెన్ పవర్:**మార్పు రావాలి... కాంగ్రెస్ రావాలంటూ పలికి మొత్తానికి కాంగ్రెస్ వాళ్లు వచ్చారని... అలాగే వారు చెప్పినట్లుగా పెద్ద మార్పే తెచ్చారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎద్దేవా చేశారు. ఈ మేరకు కేటీఆర్ ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు. 'జేఎన్టీయూ మెస్ చట్నీలో చిట్టెలుక' అనే వార్తా క్లిప్పింగ్‌ను ఆయన జోడిస్తూ... కాంగ్రెస్‌పై విమర్శలు గుప్పించారు. ఆనాటి కాంగ్రెస్ పాలనలో.. ప్రభుత్వ హాస్టళ్లలో దుస్థితి.. పురుగుల అన్నం.. నీళ్ల చారు.. ఈనాటి కాంగ్రెస్ పాలనలో..

ప్రభుత్వ హాస్టళ్లలో ఇంకా అధ్వాన పరిస్థితి.. బల్లిపడిన టిఫిన్లు, చిట్టెలుకలు తిరిగే చట్నీలు అంటూ ఎద్దేవా చేశారు. మొన్న భువనగిరి సాంఘిక సంక్షేమ పాఠశాలలో కలుషిత ఆహారం తిన్న విద్యార్థి జీవితం విషాదంతమైందని... నిన్న కోమటిపల్లి హాస్టల్లో ఉప్మాలో బల్లి పడి 20 మంది విద్యార్థులు వాంతులు చేసుకున్నారని గుర్తు చేశారు. సుల్తాన్‌పూర్ జేఎన్టీయూ హాస్టల్‌లో చట్నీలో చిట్టెలుక దర్శనంతో ఇక్కడి విద్యార్థులు బెంబేలెత్తారన్నారు. ఈ విషాహారం తింటే.. విద్యార్థుల ప్రాణాలకు గ్యారెంటీ ఎవరు?? అల్లారుముద్దుగా పెంచుకున్న తల్లిదండ్రులకు భరోసా ఎక్కడ??? అని ప్రశ్నించారు. కలుషిత ఆహారం వల్ల... పిల్లలు ఆడుకోవాల్సిన వయస్సులో ఆసుపత్రుల పాలవుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

అస్తవ్యస్తంగా మారిన ప్రభుత్వ వ్యవస్థ వల్లే విద్యార్థులకు ఈ అవస్థ వచ్చిపడిందని... దీంతో వారికి ఈ అస్వస్థత అని పేర్కొన్నారు. ఇకనైనా కాంగ్రెస్ సర్కారు కళ్లు తెరవాలని లేదంటే భావిభారత పౌరుల నిండు ప్రాణాలకే ప్రమాదమని హెచ్చరించారు. వైఫల్యాలను సరిచేయకపోతే ఊహించని విషాదం చోటు చేసుకునే అవకాశాలు ఉంటాయని హెచ్చరించారు.



# ఆర్టీసీ క్రాస్ రోడ్‌లో భారీ అగ్నిప్రమాదం



హైదరాబాద్ పెన్ పవర్:హైదరాబాద్ ఆర్టీసీ క్రాస్ రోడ్డులో భారీ అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. సప్తగిరి థియేటర్ ఎదురుగా ఉన్న భవనంలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. బిల్డింగ్ మూడో ఫ్లోర్లో మంటలు చెలరేగడంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. నాలుగో ఫ్లోర్ కు కూడా మంటలు వ్యాపించాయి. ఘటనాస్థలానికి చేరుకున్న ఫైరింజన్ సిబ్బంది..మంటలార్పే ప్రయత్నం చేస్తున్నారు.

బిల్డింగ్ లో చిక్కుకున్న ఇద్దర్ని సురక్షితంగా కిందికి దించారు రెస్క్యూ టీమ్స్. ప్లాస్టింగ్ గోదాంలో షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు వ్యాపించినట్ల తెలుస్తోంది. అగ్నిప్రమాదంతో ఆర్టీసీ క్రాస్ రోడ్డు నుంచి ముషీరాబాద్ వరకు భారీగా ట్రాఫిక్ జాం అయ్యింది.

# బాసర ఆశ్రమంలో నాలుకపై బీజాక్షరంతో అక్షరాభ్యాసం.. మండిపడుతున్న పూజారులు

**గురువారం ఆందోళనకు పిలుపునిచ్చిన పూజారులు**

**ఆలయ సంప్రదాయాలకు భంగం వాటిల్లుతుందని విమర్శలు**

**ఆగమశాస్త్రంలో ఈ విధానం ఎక్కడా లేదని వెల్లడ**

**హైదరాబాద్ పెన్ పవర్:**సరస్వతీమాత కొలువైన బాసర క్షేత్రంలో ఓ ఆశ్రమం వివాదానికి తెరలేపింది. శాస్త్రీయంగా వస్తున్న అక్షరాభ్యాస కార్యక్రమానికి భిన్నంగా నాలుకపై బీజాక్షరం రాస్తూ అక్షర స్వీకార కార్యక్రమం చేపట్టింది. పలువురు తల్లిదండ్రులు తమ చిన్నారులను తీసుకెళ్లడంతో విషయం వెలుగులోకి వచ్చింది. దీనిపై ఆశ్రమ నిర్వాహకులను ప్రశ్నించగా సరైన సమాధానం రాలేదని బాసర సరస్వతీ దేవి ఆలయ పూజారులు చెబుతున్నారు. ఆగమశాస్త్రంతో పాటు పురాణాల్లోనూ ఇలాంటి విధానం ఎక్కడా లేదని, కాళిదాసుకు మాత్రమే అమ్మవారు నాలుకపై బీజాక్షరాలు రాశారని చెప్పారు. ఈ కొత్త పోకడకు తెరతీసిన ఆశ్రమంపై వారు మండిపడుతున్నారు.



ఆలయ సంప్రదాయాలకు దీనివల్ల భంగం వాటిల్లుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ తంతును వెంటనే ఆపేయాలంటూ గురువారం పెద్ద ఎత్తున నిరసన ప్రదర్శన చేపట్టనున్నట్లు ఆలయ పూజారులు ప్రకటించారు. సరస్వతీ మాత మాలధారణ చేసిన భక్తులు, ఇతరులు కూడా పెద్ద సంఖ్యలో బాసర క్షేత్రానికి రావాలంటూ పిలుపునిచ్చారు. గురువారం మధ్యాహ్నం భారీ ర్యాలీగా వెళ్లి ఆలయ ఈవోకు మెమోరాండం సమర్పిస్తామని వివరించారు. బాసర క్షేత్రంలో ఇలాంటి వింత పోకడలకు తావులేకుండా చర్యలు తీసుకోవాలని కోరతామన్నారు. ఈ విషయంపై వెనక్కి తగ్గకుండా పోరాడతామని బాసర సరస్వతి అమ్మవారి ఆలయ పూజారులు స్పష్టం చేశారు.

# రైతు భరోసా పథకంపై విస్తృత సాయి సమావేశం

**హైదరాబాద్ పెన్ పవర్:**బుధవారం ఖమ్మం కలెక్టరేట్ కార్యాలయంలో రైతు భరోసా పథకంపై రాష్ట్ర కేబినెట్ కమిటీ చైర్మన్, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, ఇంధన శాఖల మంత్రి భట్టి విక్రమార్క మల్లు అధ్యక్షతన ఉమ్మడి ఖమ్మం జిల్లా విస్తృత సాయి సమావేశం జరిగింది. సమావేశంలో కేబినెట్ సభ్యులు రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత జౌళీ శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి లు పాల్గొన్నారు. ఇట్టి సమావేశంలో రైతులు, శాస్త్రవేత్తలు, డాక్టర్లు, లాయర్లు, జర్నలిస్టులు వివిధ వర్గాల వారు హాజరై, రైతు భరోసా అమలుకు అభిప్రాయాలు, సూచనలు చేశారు. సమావేశానికి హాజరైన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతూ, రాష్ట్ర వనరులు, సంపదను ప్రజలకే పంచుతామన్నారు. వ్యవసాయ రంగాన్ని కాపాడుకుందామని అన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, ప్రజల జీవన భృతి కి దోహదపడుతున్న రైతులకు పెట్టుబడి సాయం కింద రైతు భరోసా ఇస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చామన్నారు. ఇచ్చిన హామీని అమలు చేయడం కోసం ఇందిరమ్మ రాజ్యంలో ఏర్పడిన ప్రజా ప్రభుత్వం దృఢ సంకల్పంతో ఉందన్నారు. గత ప్రభుత్వం విడుదల చేయకుండా పెండింగ్లో పెట్టిన రైతుబంధు నిధులను సమయానుకూలంగా ప్రజా ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిస్థాయి బడ్జెట్ ప్రవేశ పెట్టనందున, రాష్ట్ర ప్రభుత్వం కూడా ఓటాన్ అకౌంటు బడ్జెట్ ను ప్రవేశ పెట్టడం జరిగిందన్నారు. ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం పూర్తిస్థాయి బడ్జెట్ ప్రవేశ పెట్టిన తర్వాత రాష్ట్ర ప్రభుత్వానికి ఇచ్చే నిధులను దృష్టిలో పెట్టుకొని త్వరలోనే రాష్ట్ర ప్రభుత్వం పూర్తిస్థాయి బడ్జెట్




ప్రవేశపెడుతుందని ఆయన తెలిపారు. పూర్తిస్థాయి బడ్జెట్ ప్రవేశపెట్టే సమయంలోనే రైతు భరోసా పథకం అమలుపై విధివిధానాల రూపకల్పనకు ప్రభుత్వం క్యాబినెట్ సబ్ కమిటీ నియామకం చేసిందన్నారు. ఇట్టి సబ్ కమిటీలో భట్టి విక్రమార్క నైన నేను, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరావు, దుద్దిల శ్రీధర్ బాబు లు సభ్యులుగా ఉన్నామన్నారు. రైతు భరోసా క్యాబినెట్ సబ్ కమిటీ సమావేశం రాష్ట్ర సచివాలయంలో నిర్వహించి, ఈ పథకం అమలు కోసం ఉమ్మడి పది జిల్లాల్లో పర్యటన చేసి, ప్రజలు, రైతుల నుంచి అభిప్రాయాలు సేకరించి విధివిధానాలు రూపొందించాలని నిర్ణయించామన్నారు.

సమావేశంలో రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళీ శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ, నిజమైన రైతులకు రైతు భరోసా అందించడానికి అన్ని వర్గాల ప్రజల నుండి అభిప్రాయ సేకరణ జరుగుతున్నదని తెలిపారు. పేద రైతులకు సహకారం అందించడానికి ప్రభుత్వం ఓపెన్ మైండెడ్ గా పనిచేస్తున్నదని అన్నారు. ప్రభుత్వం అన్ని వర్గాల ఆలోచనల మేరకు నిజమైన రైతుకు రైతు భరోసా అందిస్తామన్నారు. గతంలోలా లోపాలు, ఆర్థిక నష్టాలు తలెత్తకుండా, కష్టపడ్డ చిన్న, సన్నకారు రైతులకు చేయూత ఆదుకోవాలని ప్రభుత్వ ఉద్దేశ్యమని మంత్రి అన్నారు.

సమావేశంలో రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, రైతు భరోసా చెల్లింపులకు ప్రజల అభిప్రాయ సేకరణ చేపడుతున్నామని అన్నారు. నిజమైన రైతును ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని ఆయన తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఖర్చుపెట్టే, ప్రతి రూపాయి, రాష్ట్ర ప్రజలు వివిధ రూపాల్లో చెల్లించిందేనని ఆయన అన్నారు. గతంలో ఏ పథకం చేపట్టిన ప్రజల అభిప్రాయాలు తీసుకోలేదని, నాలుగు గోడల మధ్య తీసుకున్న నిర్ణయాన్ని అమలుచేసేవారని అన్నారు. బడుగు, బలహీన వర్గాలకు ప్రతి పైసా అకౌంట్ చెప్పాల్సిన బాధ్యత ప్రభుత్వం పై ఉందన్నారు. ఓపెన్ గా డిబేట్ చేసి, ప్రజలు, రైతుల నుండి ఏ అభిప్రాయాలు వస్తాయో, ఎవరికి సాయం చేస్తే, ఆ రైతులు మంచిగా, ఆనందంగా ఉంటారో, వివరాలు సేకరించి అమలు చేయడం ప్రభుత్వ ఉద్దేశ్యమని తెలిపారు. రాష్ట్రంలోని మిగతా 9 ఉమ్మడి జిల్లాల్లో రైతులు, ప్రముఖులు, ప్రజల అభిప్రాయాలు సేకరించి, రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో పెట్టి, నిర్ణయం తీసుకోనున్నట్లు మంత్రి తెలిపారు.

అనంతరం ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని రైతులు, రైతుసంఘాల నాయకులు, కౌలు రైతులు, డాక్టర్లు, అడ్వకేట్, జర్నలిస్టులు, శాస్త్రవేత్తలు, పలువురు వారి వారి అభిప్రాయాలను సమావేశంలో వివరించారు. సాగు భూమికే భరోసా అందజేయాలని, చిన్న సన్నకారు రైతులకు న్యాయం చేయాలని అభిప్రాయం వ్యక్తం చేశారు. ట్యాక్స్ చెల్లింపుదారులను మినహాయించాలని, ఏజెన్సీ ప్రాంతంలో పట్టాలేని రైతులకు రైతు భరోసా అందించాలని కొందరు అభిప్రాయపడ్డారు. అన్ని పంటలకు బోనస్ అందించాలని, కౌలు రైతులకు బోనస్, పట్టా రైతులకు రైతు భరోసా అందించాలని, కౌలు రైతుల గురించి ఆలోచించాలనే అభిప్రాయాలు వ్యక్తం అయ్యాయి.

ఈ కార్యక్రమంలో ఖమ్మం, మహబూబాబాద్ ఎంపీలు రామసహాయం రఘురాం రెడ్డి, పోరిక బలరాం నాయక్, ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి కె. రామకృష్ణారావు, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల కలెక్టర్లు ముజమ్మిల్ ఖాన్, జితేష్ వి పాటిల్, ఎమ్మెల్యే లు మట్టా రాగమయి, రాందాస్ నాయక్, తెల్లం వెంకట్రావు, రాష్ట్ర గిడ్డంగుల చైర్మన్ రాయల నాగేశ్వరరావు, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల వ్యవసాయ అధికారులు విజయనిర్మల, బాబూరావు, అధికారులు, రైతులు, వివిధ వర్గాల వారు, తదితరులు పాల్గొన్నారు

# స్విగ్గీలో డ్రగ్స్ డెలివరీ.. అడ్డంగా బుక్కయిన డెలివరీ బాయ్




**హైదరాబాద్ పెన్ పవర్:** సిటీలో డ్రగ్స్?అమ్మడానికి వచ్చిన స్విగ్గీ డెలివరీ బాయ్ ని సైబరాబాద్ ఎస్వోటీ పోలీసులు అరెస్ట్? చేశారు. మురళీధరన్ అనే వ్యక్తి బెంగళూర్ లో స్విగ్గీ బాయ్ గా పనిచేస్తున్నాడు. ఈ క్రమంతో హైదరాబాద్ లోని కస్టమర్లకు ఎండీఎంఏ డ్రగ్?ను అమ్మడానికి వచ్చి శంషాబాద్ వచ్చాడు. ఆర్జీఐ పీఎస్? పరిధిలో అనుమానాస్పదంగా తిరుగుతుంటే అతడిని ఎస్వోటీ , ఆర్జీఐ పోలీసులు పట్టుకుని సోదా చేశారు. అతని ప్యాంటు ఇన్నర్ జేబులో 11 గ్రాముల ఎండీఎంఏ డ్రగ్ ను?దొరికింది. ఎండీఎంఏ ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసుకుని ఆర్జీఐ పోలీసులు విచారణ చేస్తున్నారు.

# పాలంక తిరునాళ్లకు ప్లాస్టికి పూర్తిగ నిషేదము

హైదరాబాద్ పెన్ పవర్:నాగర్జున సాగర్ శ్రీశైలం టైగర్ రిజర్వు లోని గంజివారిపల్లి రేంజ్ పరిధిలో జూలై 16 నుంచి 18 వరకు తొలి ఏకాదశి పండుగ సందర్భంగా జరిగే పాలంక వీరభద్రస్వామి తిరునాళ్లను పూర్తిగా ప్లాస్టిక్ రహితంగా నిర్వహించాలని ప్రాజెక్ట్ టైగర్, మార్కాపురం డివిజన్ డిప్యూటి డైరెక్టర్ విఘ్నేశ్ అప్పావ్ ఆదేశాలు జారీచేశారని గంజివారిపల్లె రేంజ్ కార్యాలయంలో బుదవారం నాడు నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో అటవీక్షేత్రాధికారి యస్.వి. సుబ్బారావు తెలిపారు.

**రూ. 1000 ల వరకు జరిమాన ....**

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తిరునాళ్లకు వచ్చే వారు ప్లాస్టిక్ నీళ్ళ సీసాలు, ప్లాస్టిక్ కవర్లు, ప్లాస్టిక్ ప్లేట్లు మరేదైన ఇతర సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ను వెంటతెచ్చువద్దని అలా తెచ్చుకుంటే ఒక్కొక్కరికి రూ. 1000/- వరకు జరిమాన విధించబడుతుందని ఆయన వెల్లడించారు. అడవిలో మద్యము సేవించిన, అడవికి నిప్పు పెట్టిన వారిపై రూ.2000 వరకు జరిమానతో పాటు కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు.

**చెత్తకుండిలు, నీళ్ళ ట్యాంకర్లు ఏర్పాటు...**

పాలంకకు వెళ్లు మార్గములో తడి, పొడి




చెత్తలను వేరువేరుగా వేయడానకి ప్రత్యేక చెత్త కుండీలను ఏర్పాటు చేశారని పెద్దమ్మ బేస్ కాంప్, నారుతడికల బేస్ క్యాంపుల వద్ద నీళ్ల ట్యాంకర్లలతో నీటి సదుపాయాన్ని కల్పిస్తున్నామని పేర్కొన్నారు. వాహానాలను అటవీశాఖవారు సూచించిన ప్రదేశాలలో నిలుపుకుని నిర్దేశించిన ప్రదేశములలోనే బస చేయాలని చెప్పారు.

**ఉచిత అన్నదానమునకు ముందస్తు అనుమతి తప్పనిసరి...**

ఉచిత అన్నదానము నిర్వహించు దాతలు అటవీశాఖ వారి వద్ద ముందుగా అనుమతి తప్పనిసరిగా తీసుకోని ముందస్తు రుసుము చెల్లించాలని సూచించారు. చెల్లించిన రుసుము తిరునాళ్ల అయిపోయిన తరువాత తిరిగి చెల్లిస్తామన్నారు. ఉచిత అన్నదానము నిర్వహించు వారు గాని, కుటుంబ సమేతముగా వచ్చువారుగాని ఖచ్చితముగా స్టీలు ప్లేట్లు, స్టీలు గ్లాసులు మాత్రమే వినియోగించాలన్నారు. అన్నదానము కార్యాక్రమము అటవీశాఖవారు సూచించిన ప్రదేశములోనే నిర్వహించాలన్నారు. అన్నదానమునకు తెచ్చిన సరుకుల వ్యర్థాలు మరల వారివెంటే తీసుకెళ్ళాలని తెలిపారు.

**భారీ వాహానాలకు, కారులకు అనుమతి లేదు.**

పాలంక తిరునాళ్ళకు వెళ్లు మార్గములో వన్యప్రాణులు ఎక్కువగా తిరుగు ప్రాంతము చేత భారీ వాహానాలకు, కారులకు అనుమతి లేదు. కేవలం ద్విచక్ర వాహానాలు, జీపులు, ట్రాక్టర్లకు, నాలుగు చక్రల వాహానాలకు మాత్రమే అనుమతిస్తామన్నారు. వాహనదారులు గాంధీనగర్ చెక్ పోస్ట వద్ద ద్విచక్ర వాహనదారులు రూ. 200, ఇతర వాహనదారులు రూ.800 లు రుసుము చెల్లించి రశీదు తీసుకోవాలని, రశీదు లేకుండ వచ్చినవారికి జరిమాన విధించబడునని తెలిపారు. అడవికి గాని, వన్యప్రాణులకు గాని హాని కలిగించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, నిబంధనలు ఉల్లంఘించిన అతిక్రమించినవారిపై వన్యప్రాణి సంరక్షణ చట్టం - 1972 మరియు ఆంధ్రప్రదేశ్ అటవీ చట్టం - 1967 ప్రకారం తగు చర్యలు తీసుకోంటామని అన్నారు. ఈ సమావేశంలో ఫారెస్ట్ సెక్షన్ అధికారులు ఎన్, రోశయ్య, జీ. వెంకటేశ్వర్లు, బీట్ అధికారి కృష్ణచైతన్య, డి.ఇ.ఓ వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

# కనీస వేతనాలు అమలు చేయాలి..

హైదరాబాద్ పెన్ పవర్:యాచారం మండలంలో సిఐటియు ఆధ్వర్యంలో సిఐటియు కేంద్ర కమిటీ పిలుపు మేరకు కోరికల దినం సందర్భంగా తాసిల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేసి తహసీల్దార్ అయ్యప్ప కు వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి పి. బ్రహ్మయ్య, సిఐటియు మండల కన్వీనర్ ఎస్. చందు నాయక్ మాట్లాడుతూ.. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చిన తరువాత సంస్కరణలు, ప్రైవేటీకరణ విధానాలను వేగవంతంగా అమలు చేసేందుకు ముందుకు పోతుందని అన్నారు. నాలుగు లేబర్ కోడ్ లను అమలు చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. బొగ్గు బ్లాకుల వేలానికి పూనుకున్నది. ఈపీఎఫ్ సకాలంలో చెల్లించని యాజమాన్యాలకు విధించే జరిమానను భారీగా తగ్గించింది. కార్పొరేట్ మతోన్మాదులను ప్రసన్నం చేసుకుని వారికి లాభాలు కట్టబెట్టేందుకు నిశ్చయంగా ఉన్నది. కేంద్ర ప్రభుత్వ విధానాలను ప్రతిఘటించేందుకు కార్మిక వర్గ పోరాటాలు ఉధృతం చేయడానికి జులై 10న దేశవ్యాప్తంగా కోరికల దినం పాటించడం



జరుగుతుంది అన్నారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించాలని కార్మికులందరికీ కనీస వేతనం 26000 నిర్ణయించి అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆశా వర్కర్లకు ఎగ్జామ్ రద్దుచేసి పారితోషికాలు కాకుండా కనీస వేతనాలు నిర్ణయించాలని, అంగన్వాడి, మధ్యాహ్నం భోజనం, ఐకెపి వివోఏ, వైద్య ఆరోగ్య రంగం తో పాటు వివిధ స్కీం లలో పనిచేస్తున్న స్కీం వర్కర్లను కార్మికులుగా గుర్తించి కార్మిక చట్టాలు అమలు జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. గ్రామపంచాయతీ కార్మికుల పెండింగ్ వేతనాలు ఇవ్వాలని మల్టీపర్పస్ విధానం రద్దు చేయాలని. హమాలీలకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి పిఎఫ్ ఈఎస్ఐ ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ రంగ సంస్థల్లో పనిచేస్తున్న హమాలీలను 4వ తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని. మధ్యాహ్న భోజనం కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ మీసేవ ఉద్యోగులకు జీవో నెంబర్ 60 ప్రకారం కనీస వేతనం అమలు చేయాలి. విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న ఆర్టిజన్స్ అందర్నీ అర్హతలను బట్టి ప్రమోషన్స్ ఇవ్వాలి. ట్రాన్స్పోర్ట్ కార్మికులకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలి, హిట్ %ఽ% రన్ చట్టాన్ని రద్దు చేయాలి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్మిక యూనియన్ మండల అధ్యక్షులు కృష్ణ, బీసీ దబ్బూ నాయకులు జంగయ్య, అంగన్వాడి నాయకులు అండాలు, యాదమ్మ, సరిత శోభ , వసంత, లలిత, ఆశ వర్కర్లు బాలమణి, అలవేలు, పద్మ , గోవిందమ్మ, గ్రామపంచాయతీ కార్మికులు సాలమ్మ, లక్ష్మయ్య, జంగయ్య, మధ్యాహ్న భోజన కార్మికులు ప్రభావతి తదితరులు పాల్గొన్నారు